


ఎకరాకు రూ.25 వేలు పరిహారమివ్వాలని నేడు ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

రైతుల నుంచి తేమ, నూక పేరుతో రైస్‌మిల్లర్లు బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకు రైతు నుంచి వసూలు చేస్తున్నారని, ఈ సొమ్మును వెంటనే రైతులకు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 9న తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సోమవారం చెప్పారు. ఇలా ప్రతి రైతు నుంచి రూ.పది వేల నుంచి రూ.30 వేల వరకూ వసూలు చేశారని, ఆ సొమ్మును వెంటనే వెనక్కివ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కోరారు.

పేరుకే ఉచితం.. గుట్టుగా గుంజుడు..!



- ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద పిల్లలకు 25 శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలని నిబంధన
- నిబంధనలు అమలు చేయాల్సిందేనని ఇటీవల కోర్టు హెచ్చరిక
- ప్రస్తుతం కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ
- రెండు జిల్లాల్లో 880 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు
- ఇప్పటి వరకూ 406 మంది విద్యార్థులకే సీట్లు
- ప్రచారం లేకపోవడంతో దరఖాస్తులు రాని దుస్థితి
- ఒక కిలోమీటర్ పరిధిలో స్కూల్ ఉంటేనే అవకాశం
- ఉచిత సీట్లకు సైతం సాకులు చూపుతూ ఫీజు గుంజుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇచ్చే 25 శాతం ప్రవేశాలకు పలు ఫీజులుంటాయ్ అనే రీతిలో స్కూళ్ల యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరు తల్లిదండ్రుల్లో చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో ఉచిత ప్రవేశాలపై సరైన ప్రచారం లేకపోవడంతో దరఖాస్తులు పెద్దగా రాని పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది. దీంతో రెండు జిల్లాల్లోనూ ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య నామమాత్రంగా ఉంది. విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం ప్రతి ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే ప్రభుత్వాలు అమలు చేయించడం లేదు. దీనిపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో గతేడాది నుంచి దరఖాస్తుల ఆహ్వానం సాగుతోంది. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. ఏలూరు జిల్లాలో 527, పశ్చిమగోదావరిలో 360 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఫస్ట్, సెకండ్ ఫేజ్ కింద రెండు విడతల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఇప్పటి వరకూ ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఏలూరు జిల్లాలో 256 మంది, పశ్చిమలో 204 మంది మాత్రమే ఉన్నారు. రెండు జిల్లాల్లో ఒక్కో స్కూల్‌లో 25 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం లభించినా 22 వేల మంది పేద విద్యార్థులకు అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకూ సీట్లు పొందిన వారి సంఖ్య చూస్తే వందల్లో కూడా లేదు.

ఉచిత సీటైనా తప్పని ఫీజుల ఒత్తిడి

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి యాజమాన్యాలు అనేక సాకులు చెబుతూ సొమ్ము గుంజుతున్నాయనే ప్రచారం సాగుతోంది. బహిరంగంగా తల్లిదండ్రులు వెల్లడించలేకపోతున్నప్పటికీ వసూళ్లపై మాత్రం చర్చ సాగుతోంది. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజు, ఎన్‌రోల్‌మెంట్ ఫీజు పేరిట దాదాపు రూ.మూడు వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. స్కూల్ స్థాయిని బట్టి పుస్తకాలకు రూ.ఐదు వేలకుపైగా బాదేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అనేక కారణాలు చెబుతూ ఫీజు వసూలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో గత్యంతరం లేక కొంతమంది ఫీజులు చెల్లిస్తున్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎటువంటి ఫీజూ చెల్లించొద్దని విద్యా శాఖాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై ప్రచారం కరువు

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి విద్యాశాఖ సరైన ప్రచారం చేయకపోవడంతో దరఖాస్తులు రావడం లేదని తెలుస్తోంది. వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పటికీ దీనిపై సరైన ప్రచారం లేదనే చెప్పాలి. అధికారులు సైతం మీడియా సమావేశాలు పెట్టి వివరించిన పరిస్థితి లేదు. ఏదో మమ అన్నట్లు మాట్లాడి సరిపెడుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలపై ఉపాధ్యాయులకు సైతం సరైన సమాచారం లేదంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రూ.వేలకు వేలు ఫీజు కట్టలేక సతమతమవుతున్న పేద కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉచిత ప్రవేశాల గురించి ప్రచారం లేకపోవడంతో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఉచిత ప్రవేశం పొందే విద్యార్థి స్కూల్‌కు ఒక కిలోమీటర్ దూరంలో ఉండాలనే నిబంధన సైతం పెనుశాపంగా మారింది. ఈ నిబంధనతో గ్రామాల్లో విద్యార్థులకు ప్రవేశం లేకుండాపోతోంది. మండల కేంద్రం, పట్టణాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రమే అవకాశం లభించే పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ సమయం ఉంది. ఇప్పటికైనా ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తే పేద విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

ఇక రెవెన్యూ డివిజన్‌గా తాడేపల్లిగూడెం

- ఐదు మండలాలతో ఏర్పాటు
- పశ్చిమలో మూడుకు చేరిన రెవెన్యూ డివిజన్లు
- భీమవరం డివిజన్లోకి గణపవరం మండలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌ను ఐదు మండలాలతో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం తుది గెజిట్ విడుదల చేసింది. ఇక నుంచి తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌గా మారింది. కొత్తగా ఏర్పడిన ఈ డివిజన్‌లో తాడేపల్లిగూడెం, పెంటపాడు, అత్తిలి, తణుకు, ఇరగవరం మండలాలు ఉంటాయి. కొత్త డివిజన్ ఏర్పాటుతో పశ్చిమగోదావరి జిల్లాలో రెవెన్యూ డివిజన్ల సంఖ్య మూడుకు చేరింది. నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో నర్సాపురం, పాలకొల్లు, పోడూరు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మొత్తం ఎనిమిది మండలాలతో ఉండగా భీమవరం డివిజన్ భీమవరం, వీరవాసరం, ఉండి, కాళ్ల, పాలకోడేరు, ఆకివీడు, గణపవరం మండలాలతో ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తగా చేరిన గణపవరం మండలాన్ని భీమవరం డివిజన్లో చేర్చారు.

ఉపాధ్యాయుల కేసులు, సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ శివశంకర్

ప్రజాశక్తి - భీమవరం


వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు, సస్పెన్షన్లను తక్షణం ఎత్తివేయాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ ఎస్.శివశంకర్ డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి మూడోదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో అధికారులకు జెఎసి నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ సంబంధం లేని పనులను అప్పగించి ఉపాధ్యాయులను ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయులకు ఎటువంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఎపి ఆర్ఎస్ఎ కలెక్టర్ కార్యాలయ జాయింట సెక్రటరీ వివి.పెద్దిరాజు మాట్లాడుతూ 2022లో ఉపాధ్యాయులపై అక్రమంగా పెట్టిన క్రిమినల్ కేసులు, బైండోవర్ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా కార్యదర్శి ఫణి, సీనియర్ సహాయకులు పి.జగన్మోహన్, సాంబశివరావు, జూనియర్ సహాయకులు జీవన్, పధ్వీ, సాయి, సిబ్బంది బుజ్జియ్య, మురళీ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని, సిపిఎస్ రద్దయ్యే వరకు పోరాడి తీరుతామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి స్పష్టం చేశారు. 2022 ఏప్రిల్ 18 నుండి 25వ తేదీ వరకు సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టి 25న సిఎంఒ ముట్టడికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన యుటిఎఫ్ నేతలపై అప్పట్లో కేసులు పెట్టారు. ఏడాది తర్వాత కోర్టుకు హాజరు కావాలని యుటిఎఫ్ నేతలకు నోటీసులు అందాయి. దీంతో విజయవాడ మూడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, నేతలు కె.శ్రీనివాస్, శైలజ, లక్ష్మి, ఎంఎస్ఆర్‌సిహెచ్.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి మాట్లాడుతూ సంవత్సరం క్రితం సిపిఎస్ రద్దు కోసం పోరాడిన సందర్భంలో 65 మందిని అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారని, ఆ కేసును ఇప్పుడు బయటికి తీసి కోర్టుకు పంపడం దారుణమన్నారు. అరెస్టులు చేసి కోర్టులకు తిప్పినంత మాత్రాన పోరాటం ఆగదని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి 12న ఉపాధి కూలీల ధర్నా

జయప్రదం చేయాలని మోటారు సైకిళ్ల ర్యాలీ, కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం జల్లి కాకినాడ, మల్లపరాజుపేట, కేశవరం, కోమట్రు గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలకు మండల అధ్యక్ష కార్యదర్శులు చోడదాసి సంజీవరావు, నరాలశెట్టి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి మాట్లాడుతూ ఎన్ఎంఎస్ యాప్ కూలీలకు శాపంగా మారిందన్నారు. సమ్మర్ అలవెన్స్ వెంటనే పునరిద్ధరించాలని, పాత మస్తర్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాలుగు వారాలవుతున్నా వేతనాలు పడకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేతా శ్రీనివాస్, జోగి సత్యనారాయణ, ఎం.మహేష్, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరగవరం: మోడీ పాలనలో ఉపాధి హామీ చట్టం ప్రమాదంలో పడిందని. కూలీలందరూ ఐకమత్యంతో దీన్ని కాపాడుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. ఇరగవరం మండలం అర్జునుడుపాలెం పంచాయతీ పరిధి పెద్దిరెడ్డిపాలెం, కంతేరు గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి పనిలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు


గణపవరం మండలంలో..

మాట్లాడుతూ రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని. రెండు పూటలా పని, రెండుసార్లు ఫొటో ద్వారా మస్తర్ విధానాన్ని తొలగించి, పాత పద్ధతిలో కొలతల ప్రకారం ఒకే పూట పని చేయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు, సైట్ సూపర్‌వైజర్లకు అవసరమైన స్మార్ట్‌ఫోన్‌లను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కూలీలు చేసిన పనికి పేస్లిప్‌లు, పనిముట్లతోపాటు ప్రతి రెండు వారాలకోసారి పోస్టాఫీస్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో ఉపాధి కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీను, పొట్ల బాలయ్య, బొర్రా ఆంజనేయులు, బొక్కా వెంకటరావు, కప్పల సూర్యారావు, గుత్తుల అప్పారావు, తామరపల్లి వెంకటేశ్వరరావు, మారంపూడి సంతోషం, ముసలయ్య, బాలాజీ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీ సైట్ సూపర్‌వైజర్లకు ఒక్కో కూలీకి రూ.5 పారితోషికం ఇవ్వాలని, పట్టణ ప్రాంతంలో కూడా ఉపాధి పనులు విస్తరించడానికి ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని, కోర్టు పెండింగ్లో ఉన్న గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాది పనుల పర్యటనలో భాగంగా సోమవారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కూలీలకు సమ్మర్ అలవెన్స్, పనిముట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కె.పండు, బుర్ల వెంకటలక్ష్మి, గుదే పాపమ్మ, నక్క లక్ష్మి, మేడంకుల నాగమణి, గొలిమి సుబ్బారావు, తుమ్మల చెల్లమ్మ, బుర్ల దుర్గారావు, కళ్లెం జ్యోతి, జి.లక్ష్మి, మేకల మహాలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ఉపాధి హామీ పరిరక్షణకు ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం చింతపర్రు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

పోడూరు: ఉపాధి హామీ కూలీలకు ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం అధ్వర్యంలో పోడూరు పంచాయతీ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి పంచాయితీ కార్యదర్శి పి.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోజేస్ మాట్లాడుతూ అందరికీ పేస్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిల్లి ప్రసాద్ మాట్లాడగా పద్మ, బురాబత్తుల లక్ష్మి, ఆకుల లక్ష్మి పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

తడిచి, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన, కురుస్తున్న అకాల భారీ వర్షాల వల్ల ధాన్యం చాలా చోట్ల తడిచిపోవడంతో రైతులు నానావస్థలు పడుతున్నారన్నారు. వర్షాలు ప్రకృతి విపత్తయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో, సంచులు అందించడంలో, వాహనాలు సకాలంలో సమకూర్చడంలో, బరకాలు, టార్పాలిన్లు ఇచ్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నష్టాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చాలాచోట్ల రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ముందుకురాకపోవడం రైతాంగాన్ని తీవ్రంగా కలవర పెడుతుందన్నారు. నిబంధనలు సడలించి రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఒకవైపు మంత్రులు, జిల్లా అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. నూక శాతం ఎక్కువ ఉందనే పేరుతో రైతుల నుంచి కొనుగోలుదార్లు అడ్వాన్స్ డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. డబ్బు చెల్లిస్తేనే కొనుగోళ్లు చేస్తామని తేల్చి చెబుతున్నారన్నారు. ఒకవైపున ధాన్యం తడిచిపోయి, మాసూళ్లు కాక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు కొనుగోళ్లకు ఇన్ని ఇబ్బందులు పెట్టడం గోరుచుట్టుపై రోకటి పోటులా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిబంధలను సడలించి రైతుల నుంచి ఒక్క పైసా కూడా వసూలు చేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతుల్ని అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్రమశిక్షణ చర్యలు నమోదు తప్పనిసరి

జిల్లా ఖజానాధికారి గణేష్

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న గణేష్

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉద్యోగుల మాస్టర్ డేటాలో ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణా చర్యలు విధిగా నమోదు చేయాలని జిల్లా ఖజానా శాఖాధికారి అడారి గణేష్ అన్నారు. సోమవారం జిల్లా ఖజానా కార్యాలయంలో జిల్లా అధికారులకు సంబంధిత శాఖల సిబ్బందిపై ఉన్న క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన డేటాను ఏ విధంగా నమోదు చేయాలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ పరిధిలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై పెండింగులో ఉన్న క్రమశిక్షణ చర్యల సత్వర పరిష్కారానికి వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై వివిధ దశల్లో పెండింగులో ఉన్న క్రమశిక్షణా చర్యల డేటాబేస్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ డేటా ను ఈ నెల 12 వ తేదీలోపు ప్రతి డిడిఒ తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు

డిఇఒకు ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం


వినతిపత్రం అందిస్తున్న నేతలు

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిఇఒ ఆర్.వెంకటరమణకు ఎస్ఎఫ్ఐ నేతలు కలెక్టరేట్లో సోమవారం ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫారం పేర్లతో వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. పలు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తల్లిదండ్రుల దగ్గర నుండి వీటి పేరు చెప్పి వేలకు వేలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అధికారికంగా అడ్మిషన్లు ప్రారంభించక ముందే విద్యను వ్యాపారంగా ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులను ఆకర్షించి ఫీజులను యథేచ్ఛగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖాధికారులు అటువంటి ప్రయివేటు పాఠశాలలను గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వినతి అందించిన వారిలో పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ ఉన్నారు.

స్పందన వినతులను నాణ్యంగా పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

భీమవరం: స్పందనలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు చక్కని పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 207 వినతులను డిఆర్ఒ, జిల్లా అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ డి.అఖిల, డిఎల్‌పిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎపి సీడ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం



నినదిస్తున్న నేతలు, కార్మికులు

ఎపి సీడ్స్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. ఎపి సీడ్స్‌లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నినదించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ తణుకు ఎపి సీడ్స్‌లో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టి కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. రాజకీయ వేధింపులతో కొంతమందిని తొలగించి కార్మికుల జీవితాలతో యాజమాన్యం ఆడుకుంటుందని విమర్శించారు. గత రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, ఎపి సీడ్స్ యూనియన్ నాయకులు టి.రామకృష్ణ, త్రిమూర్తులు, జె.సాంబశివరావు, బి.శ్రీహరి, కె.నరసింహారావు, కె.శ్రీను, జి.శ్రీను, కె.వెంకటరమణ, సూరిబాబు, సతీష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

- కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు
- కలెక్టరేట్ వద్ద కౌలు రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీ అరికట్టాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణికి వినతిపత్రం అందించి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కోతకొచ్చిన పంట అమ్ముకుంటే చేతిలోకి డబ్బు వస్తుందని రైతాంగం ఆశపడతారని, అయితే జిల్లాలో పంట అమ్ముకోవాలంటే వేలాది రూపాయలు ముందు చెల్లించాల్సిన దుస్థితి దాపురించిందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో నూక, తేమశాతం పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని కోరారు. ఆర్‌బికె అధికారులు, విఆర్ఒలు పంట నమోదు సమయంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండా 1156, 1153, 126 రకాలను కూడా 1121 రకంగా నమోదు చేశారని తెలిపారు. దీంతో మిల్లర్లు రకం మారిందంటూ రైతులను ఇబ్బంది పెట్టి డబ్బు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డిఆర్ఒ కృష్ణవేణి మాట్లాడుతూ వెంటనే చర్యలు చేపట్టి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కౌలు రైతులు సాంబశివరావు, సూరిబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

ధాన్యం అంతా కొంటాం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అకాల వర్షాలకు తడిచిన ధాన్యం అంతటినీ కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నందమూరు, కృష్ణయ్యపాలెం గ్రామాల్లో మంత్రి కారుమూరి డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణతో కలిసి సోమవారం పర్యటించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. మంత్రులు ఇరువురు మాట్లాడుతూ ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు రూ.850 కోట్లు చెల్లించామని, ఇంకా ఎంతైనా కొని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రైతుల నుండి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు మిల్లర్ల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు.

వారి వెంట సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామప్రసాద్, సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, తహశీల్దార్ వైకెవి.అప్పారావు, సంబంధిత అధికారులు, నాయకులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి స్టూడెంట్ ఫెస్ట్

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ వీరవాసరం ఎస్‌ఎంబిబిఎవి డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ వీరవాసరం మండల కమిటీ తెలిపింది. ఈ మేరకు స్టూడెంట్ ఫెస్ట్ ప్రచార పత్రికను వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మంగతాయారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థులను చైతన్యం చేయడంలో ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫెస్ట్‌ను విద్యార్థులు, మేధావులు, పెద్దలు విజయవంతం చేసేందుకు సహకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జెడివి.ప్రసాద్, ఉపాధ్యాయుడు చికిలే రాజకుమార్ రాజు పాల్గొన్నారు.


వెంకట్రామరాజును సత్కరిస్తున్న సభ్యులు

వెంకట్రామరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - కాళ్ల

సంఘ సేవకుడు, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట రామరాజుకు డాక్టరేట్ రావడం అభినందనీయమని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య అన్నారు. సోమవారం కాళ్లకూరులో డాక్టరేట్ దాట్ల వెంకట్రామరాజుకు సత్కార సభ నిర్వహించారు. కాళ్లకూరు గ్రామానికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట్రామరాజు సేవలను గుర్తించి బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ ఇటీవల డాక్టరేట్ అందించిందన్నారు. అనంతరం వెంకట్రామరాజును ఘనంగా సన్మానించారు. వెంకట్రామరాజు సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, మండల అధ్యక్షులు కొనా రంజిత్, పాస్టర్ అహరోను, గాతల సందీప్ పాల్గొన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ పుట్టినరోజు సందర్భంగా భీమవరం ప్రభుత్వాసుపత్రిలో 80 మంది రోగులకు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు ఆధ్వర్యంలో రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మానవతా దృక్పథంతో ఆదుకోవాలన్నారు. పుష్ప రాజ్ జాతి కోసం అనునిత్యం కష్టపడే వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, మండల అధ్యక్షులు దాసరి చిరంజీవి, ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షులు జోస్యుల వజ్రం పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మండలంలోని వీరవాసరం, పెర్కిపాలెం గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. సిఎం ప్యాలెస్‌లో కూర్చుని ఉంటే రైతులు పడుతున్న ఇబ్బందులు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఆమె వెంట టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కొల్ల నాగేశ్వరరావు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వీరవల్లి చంద్రశేఖర్, పీతల సుబ్రహ్మణ్యం, మల్ల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వీరవాసరంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - వీరవాసరం

పదేళ్లుగా వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు ఎనలేనివని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచి సోమవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఈ సంఘం చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుని వారికి తోచిన విధంగా సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా చైతన్య శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొడవళ్లూరి ఈశ్వరరావు, ఆనేపు సాయిబాబా, గొల్లపల్లి వెంకటేష్, పెదగాడి నాగేంద్ర, గంగరాజు పాల్గొన్నారు.

నిమ్మలవి లేనిపోని ఆరోపణలు : తాతాజీ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యతనిస్తోందని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రకృతి వైపరీత్యాల సమస్యను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఏ రైస్ మిల్లులో ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైసిపి పేరులోనే రైతు ఇమిడి ఉందని, టిడిపి హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఎగవేస్తే జగన్ ప్రభుత్వం రైతులను ఆదుకుందని చెప్పారు. టిడిపి హయాంలో ధాన్యం క్వింటాల్‌కు రూ.1,550కు కొనుగోలు చేస్తే వైసిపి ప్రభుత్వం రూ.2,040 కొనుగోలు చేస్తోందని చెప్పారు. ఏటా రూ.13,500 వైఎస్సార్ రైతు భరోసా రైతులకు అందిస్తున్నామని చెప్పారు. అకాలవర్షం పాలయ్యేందుకు 12 రైసుమిల్లులకు పర్మిట్లు తీసుకున్నామని, అధికారుల పర్యవేక్షణలో మిల్లర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స కృష్ణాజీ, పాలపర్తి కృపానంద్, చెన్ను విజయ్, చిట్టిబాబు, కొరగింజల శ్రీనివాస్, మండేల బుజ్జి పాల్గొన్నారు.

కాపవరంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలోని కాపవరంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలను, డయాబెటిక్, బిపి వ్యాధిగ్రస్తులను, రక్తహీనత లోపం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడాల హరిబాబు, ఎన్ఎస్ అమలే శ్రీరాజు, తారక సత్య సురేష్, ఎంఎల్‌హెచ్‌పి.యువతేజ, సుజ్జాన మణి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎపి పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పాలకొల్లు మండల విస్తృత సమావేశం డిమాండ్ చేసింది. లంకలకోడేరులో నిర్వహించిన సమావేశానికి మండల అధ్యక్షులు రాజబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఇంటి వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో మన్నే సత్యనారాయణ, బొక్కా బాలసుబ్రహ్మణ్యం, జి.బాలకృష్ణ, ఇంటి సత్యవతి పాల్గొన్నారు.


ఆచంట: అల్లూరి పోరాట స్ఫూర్తితో సమస్యలపై పోరాడతామని పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో పంచాయతీ కార్మిక సంఘం మండల విస్తృత సమావేశం యూనియన్ నాయకులు నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి సదుపాయాలను అందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు కనీస వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు వి.అంజిబాబు, సోమరుడు దుర్గాప్రసాద్, బెజవాద సురేష్, మాధవరావు పాల్గొన్నారు.

అన్నదాత ఆవేదన..

తడిసిన, మొలకెత్తిన ధాన్యంతో రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

అకాల వర్షం రైతులను నిండా ముంచింది. పంట చేతికొచ్చే సమయంలో తుపాను కారణంగా రైతులను ఆర్థికంగా మరింత కుంగదీసింది. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని దాళ్వా సాగు చేసినా వాతావరణం అనుకూలించకపోవడంతో ఎకరాకు ఎనిమిది నుంచి పది బస్తాల వరకూ దిగుబడి కోల్పోయామంటూ రైతులు కంటతడి పెడుతున్నారు.


కోడేరులో నేలకొరిగిన వరిచేను

మండలంలో ఈ ఏడాది దాదాపు 12,300 ఎకరాల్లో దాళ్వాసాగు చేశారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడి భారీగా పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో అన్నదాతలకు దిగులు పట్టుకుంది. కురిసిన వర్షాలకు పంట చేలు నీట మునిగి, నేలకొరిగి దెబ్బతినడంతో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. కనీసం సాగు ఖర్చులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ప్రారంభ దశలో సాగునీటి కోసం ఎకరాకు రూ.5 వేల వరకూ వెచ్చించారంటే ఆశ్చర్యం కలగమానదు. ఎలుకలు, చీడపీడలను ఎదుర్కొని సాగుచేసిన రైతులను ప్రకృతి వైపరీత్యాలు కొంగదీశాయి. వర్షానికి మండలంలో ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, పెనుమంచిలి, వల్లూరు, కరుగోరుమిల్లి, పెదమల్లం, కోడేరు గ్రామాల్లోని అనేక చోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. ఆరబెట్టుకున్న ధాన్యం రాశుల్లోకి నీరు చేరడంతో ధాన్యం మొలకెత్తి, రంగు మారడంతో రైతులు లబోదిబో మంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎఫ్‌సిఐ ద్వారా ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మేకా ఉదయభాస్కర్,కౌలు రైతు, ఆచంట

ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేశామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా సంచుల కొరత తీవ్రంగా ఉంది. ఒక పక్క వాతావరణం అనుకూలించకపోవడం, తేమశాతం పేరుతో రైతులు అనేక అవస్థలకు గురవుతున్నారు. తక్షణం ప్రభుత్వం కల్పించుకుని రైతులను ఆదుకోవాలి.

సంచులు అందుబాటులో ఉంచాలి

బాలం నాగేశ్వరరావు, కౌలు రైతు, కొడమంచిలి

పంట చేతికొచ్చే సమయంలో ఏటా ప్రకృతి విరుచుకుపడుతోంది. దాళ్వాలో పంటలు బాగానే పండాయి. పనులు ముమ్మురంగా సాగుతున్న తరుణంలో తుపాన్ ప్రభావంతో రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. ధాన్యం రాశుల కిందకు నీరు చేరడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రాత్రీ పగలు తేడా లేకుండా ధాన్యం రాశుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అవసరమైన సంచులు అందుబాటులో లేక పరిస్థితి గోరుచుట్టు పై రోకలి పోటులా ఉంది. తక్షణం ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో వైఎస్ఆర్ శాఖా గ్రంథాలయంలో జిల్లా శాఖా గ్రంథాలయ అధికారుల ఉత్తర్వుల మేరకు స్వచ్ఛంద సంస్థలు విజ్ఞానవేదిక అరసవల్లి వెంకటాచారి ఛారిటబుల్ ట్రస్టు సహకార సౌజన్యంతో శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో బాల బాలికలకు విజ్ఞాన సముపార్జన తదితర అంశాలపై ప్రభుత్వం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. వైఎస్ఆర్ శాఖా గ్రంథాలయం అధికారి ఎన్.వెంకటేశ్వరరావు (వెంకట్) వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం జిల్లా గ్రంథాలయ శాఖాధికారులు అందించిన ప్రణాళికను 40 రోజులు కార్యక్రమాలను వివరించారు. రంగసాయి, సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కార్యక్రమంలో పిఎస్ఎం గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.సుధారాణి, శిక్షణ శిబిర గురువులు కలిగొట్ల గోపాల శర్మ (యోగ), పద్మ (రీడింగ్), శ్యామల (చిత్రలేఖనం), ఎన్.లక్ష్మి (క్రీడలు) పాల్గొన్నారు.


పెనుమంత్ర : విద్యార్థులకు సన్మానం చేస్తున్న నిర్వాహకులు

పెనుమంత్ర : పిల్లలు ఫోన్‌కు అలవాటు పడి చదువుపై శ్రద్ధ చూపడం లేదని పొలమూరు మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ అన్నారు. డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి వినోదంలో భాగంగా సోమవారం పదిలో పొలమూరు జెడ్‌పి హెచ్ఎస్ స్కూల్లో మొదటి, మూడు స్థానాలు సాధించిన జొన్నాడ లక్ష్మి, సత్యశ్రీ, పెంటపాటి వెంకట మాధురి, కండిబోయిన రామ్ చరణ్ గణేష్‌ను డివైఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా కడలి శ్రీనివాస్ మాస్టర్ పిల్లలకు కెరియర్ గైడెన్స్ మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక యూత్ కన్వీనర్ చింతపల్లి మావో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బొంతు విజయ్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు ప్రమోద్, భారతి భరత్ , విద్యార్థులు పాల్గొన్నారు.

కాళ్ల : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పి.విశ్వనాథరాజు అన్నారు. సోమవారం కోపల్లె గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఇఒ ఎ.రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.సుభాషిణి, లైబ్రేరియన్ స్వరూప రాణి, స్టేట్ రిసోర్స్ పర్సన్ బిఆర్ఎంకె.స్వామి, ఉపాధ్యాయులు కృష్ణంరాజు, ధనశ్రీ, వెంకీనాయుడు పాల్గొన్నారు.

ఉండి: ప్రతి విద్యార్థీ పుస్తక పఠనం అలవర్చుకోవాలని యండగండి గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. యండగండిలో శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం సర్పంచి చిన్న కృష్ణమూర్తి, ఉండి మండల పరిషత్ సహ ఉపాధ్యక్షురాలు దత్తాల సుజాత రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు సెలవులు రావడంతో ఎక్కువ మంది విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారన్నారు. ప్రతి విద్యార్థీ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేగేశ్న సత్తిరాజు, గ్రంథాలయాధికారి ఎన్‌సిహెచ్ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రత్తి వీరాస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్తి వీరాస్వామి, ఎన్.సల్మాన్‌రాజు, నున్నా సత్యం, ఎ.జనార్ధనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ జ్ఞానాన్ని మరింత పెంచుకోవాడానికి ఉపయోగపడే వేసవి శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని గణపవరం సర్పంచి ఎం.అలంకారం తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి సలాది రత్నదుర్గా కుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు జ్యోతి, గుమ్మడి సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం : సమ్మర్ క్యాంపు జూన్ 11వ తేదీ వరకూ జరుగుతుందని, పిల్లలు పాల్గొనాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు. నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద వేసవి శిక్షణ తరగతులను గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.సుధీర్‌మోహన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కెవి రావు పాల్గొని గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులత భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, సెక్రటరీ అల్లు బాబూరావు, రత్నకుమార్ పాల్గొన్నారు.

గణపవరం : పిప్పర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాకర శ్యామ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం వేసవి విజ్ఞాన పోస్టర్లను విడుదల చేశారు. లైబ్రేరియన్ రంగారావు మాట్లాడుతూ ఈ శిబిరం జూన్ 11వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పచ్చిపులుసు గోవిందు, ఐవి.నరసింహరాజు, గుడ్ల వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

తణుకు : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది కె.వీరరెడ్డి అన్నారు. స్థానిక పురుషుల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కోసూరి గాంధీ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వీరవాసరం : ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న ప్రయత్నం ఎనలేనిదని ఎస్ఐ రమేష్ అన్నారు. జన విజ్ఞాన వేదిక, రీడర్స్‌ఫోరం, శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం ఉచిత శిక్షణ కార్యక్రమం వీరవాసరం శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రారంభమైంది. సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, బాజంకి కృష్ణారావు, జివివి.రామానుజరావు, సబ్బారపు వెంకట్రావు, పి.హరికృష్ణ, సిహెచ్‌వి.లక్ష్మి, పి.సాయిబాబు పాల్గొన్నారు.

బిసిలంతా ఐక్యం కావాలి

టిడిపి బిసి నాయకులు వీరవల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - కాళ్ల

జగన్ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించాలంటే బిసిలంతా ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి బిసి నాయకులు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ప్రజాశక్తితో మాట్లాడారు. రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా బిసి నాయకులు రవీంద్రను కలిసి సత్కరించామన్నారు. బిసిలకు రాజకీయ హక్కులు కల్పించింది టిడిపి అన్నారు. టిడిపికి వెన్నెముక అయిన బిసిలు పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. 2024లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యతను బిసిలు భుజాన వేసుకోవాలన్నారు. టిడిపి విజయం కోసం ప్రతి కార్యకర్తా శ్రమించాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు బిసిల మధ్య దూరం పెంచాలని చూస్తున్నాయన్నారు. ప్రతి టిడిపి కార్యకర్తా రాబోయే రోజుల్లో పార్టీని విజయం వైపు నడిపించాలన్నారు. త్వరలోనే జిల్లాకు చెందిన బిసిలతో సభ ఏర్పాటు చేస్తామన్నారు.


కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న బిసి నాయకులు


విద్యార్థినులకు నగదు అందజేసి సత్కరించిన సర్పంచి శ్రీనివాస్, ఉపాధ్యాయులు

విద్యతోనే బంగారు భవిష్యత్తు

విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదివి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని విస్సాకోడేరు సర్పంచి బొల్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఇదే పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేసిన కొల్ల శ్రీనివాస రాజశ్రీ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, పిల్లలు అందజేసిన రూ.10 వేలు నగదు బహుమతిని సర్పంచి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన పి.లత నాగశ్రీకి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన శ్రీఅఖిలకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన లక్ష్మీ ప్రసన్నకు రూ.2 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు అందించిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నెలకొల్పడం ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం సాయంత్రం మొగల్తూరులోని సత్రవపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన ఒకటో సచివాలయాన్ని, అబ్రహంపేటలో రూ.పదిహేను లక్షల నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించామన్నారు. అబ్రహంపేటలోని సంఘస్తులు కమ్యూనిటీ భవనం కావాలని కోరడంతో దానికి నిధులు మంజూరు చేయించి మూడు నెలల్లో పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మొగల్తూరులో నాలుగు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలు వైసిపి ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్రంలోనే గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాల్లో నరసాపురం నియోజకవర్గం నిలిచి ఆదర్శవంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యుల తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, దుసలపూడి దొరబాబు, కుక్కల కృష్ణమోహన్ ఉన్నారు.

వికలాంగుల హక్కుల చట్టం అమలుకు కృషి

భీమవరం : వికలాంగుల హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జిల్లా స్థాయి వికలాంగుల హక్కుల సమావేశాన్ని కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ వికలాంగుల జీవన ప్రమాణాల మెరుగుదల, వారి హక్కుల పరిరక్షణ, మరిన్ని సదుపాయాలు కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కేంద్రం ప్రభుత్వం 2016లో చట్టాన్ని చేసిందన్నారు. దీనికి అనుబంధంగా 2023లో ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించి, తొలిసారిగా జిల్లా కమిటీలు ఏర్పాటుకు సూచించడం జరిగిందన్నారు. శారీరక, మానసిక వైకల్యాలు కలిగిన పిల్లలు సామాన్య విద్యార్థులతో సమానంగా చదువు నేర్చేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. యుడిఐడి కార్డులు వెంటనే పంపిణీకి చర్యలను తీసుకోవాలని డిపిఒను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి జివివి.సత్యనారాయణ, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్‌వి.రమణ, పీడీ డిఆర్‌డిఎ ఎస్ఎస్ఎస్ వేణుగోపాల్, డిపిఒ ఎం.నాగలత పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి : డిఆర్‌ఒ

భీమవరం : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్త సంబంధీకులు కావాలనే నినాదంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ముందుకెళ్తోందని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ స్థాపకుడు జీన్ హెన్రీ డునాట్ చిత్రపటానికి పూలమాలలు వేసి డిఆర్‌ఒ ఘనంగా నివాళు లర్పించి మాట్లాడారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లాలో 2022లో ప్రారంభించినట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రజల సహకారంతో ముందుకెళ్తోందన్నారు. జిల్లా రెడ్‌క్రాస్‌లో ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా కలెక్టర్ ప్రశాంతి సోమవారం రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా గవర్నర్ మెడల్‌ను పొందడం జరుగుతోదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, భీమవరం ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలకొల్లు: పాత్రికేయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం తహాశీల్దార్ పెద్దిరాజుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో, జిల్లాలో పాత్రికేయులకు అక్రిడేషన్లు గతంలో వలే విరివిగా మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో కనీసం నలుగురికి అక్రిడేషన్లు ఇవ్వాలని, డెస్క్‌లో పనిచేసే మీడియా ప్రతినిధులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన పాత్రికేయులకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరారు. ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్.రాజు, కోశాధికారి టి.రాంబాబు, సీనియర్ పాత్రికేయులు ఎంఎన్‌వి.సాంబశివరావు, ప్రసాద్, సత్యనారాయణ, అప్పలరాజు పాల్గొన్నారు.

మోహిత బాల మణికంఠకు అభినందనలు

గణపవరం: పదిలో 554 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన గణపవరానికి చెందిన రేవాటి మోహిత బాలమణికంఠకు సోమవారం స్కూల్లో ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ తన తండ్రి నరశింహమూర్తి. గణపవరం విఆర్ఎగా పనిచేస్తున్నట్లు తెలిపాడు. తండ్రి ప్రోత్సాహంతో భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ డిజైనర్ అవ్వాలనే లక్ష్యంతో ఉన్నాను. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, ఉపాధ్యాయులు కె.హరినాధ్, సత్యనారాయణ, మణికంఠ తండ్రి నరసింహమూర్తి పాల్గొన్నారు.

2వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పర్యటన

నరసాపురం టౌన్: మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి వెంకటరమణ జయరాజు 2వ వార్డులో సోమవారం పర్యటించి డ్రెయిన్ పూడికతీత, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో డ్రెయిన్ సిల్టు తొలగించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఆమె వెంట దిడ్ల నాగరాజు, జయరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు